

ఆర్‌టిపిపిలో బూడిద లోడింగ్ ప్రారంభం

- భారీగా పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి- ఎర్రగుంట్ల : ఆర్‌టిపిపిలో పోలీసు బందోబస్తు మధ్య సోమవారం బూడిద లోడింగ్ ప్రారంభమైంది. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అనుచరులు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి వాహనాలను కొద్ది రోజుల కిందట అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ వ్యవహారం చంద్రబాబు దృష్టికి వెళ్లింది. జెసి ప్రభాకర్ రెడ్డి అనారోగ్య కారణంగా సిఎం వద్దకు వెళ్లకపోవడంతో సమస్యను రెండు రోజులలో పరిష్కరిస్తామని సిఎం హామీ ఇచ్చినట్లు సమాచారం. సోమవారం ఆర్‌టిపిపిలో స్థానిక నాయకులు సంజీవరెడ్డి, జవహర్ రెడ్డి తమ వాహనాలతో లోడింగ్ ప్రక్రియను ప్రారంభించారు. జెసి వాహనాలు ఫ్లయాష్ లోడ్ కోసం వస్తే గొడవలు జరిగే ప్రమాదం ఉందని భావించిన పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తును నిర్వహించారు. ఈ క్రమంలో తరచూ జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

ఉపశమనం!

రబీ పంటలకు ఊతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఫెంగల్ తుపాన్ ఉపశమనాన్ని కలిగించింది. ఆది, సోమ, మంగళవారాల్లో మోస్తరు వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావం ఫలితంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వరి మినహాయిస్తే మిగిలిన రబీ పంటలకు ఉప కరించింది. రబీ సీజన్‌లో భాగంగా నవంబర్ నెలాఖరు నుంచి ఆశాజనకంగా వర్షం కురవని నేపథ్యంలో ఆందోళన కలిగించింది. అల్పపీడన ప్రభావం చూపడంతో మోస్తరు వర్షపాతం నమోదు కావడం ఉపశమనాన్ని కలిగించింది. ఫెంగల్ అల్పపీడనం కారణంగా జిల్లాల వ్యాప్తంగా 150 ఎకరాల్లో నీళ్ల నిలవడం ఆందోళన కలిగించింది. ఏదేమైనా ఫెంగల్ తుఫాన్ కారణంగా జిల్లా వ్యాప్తంగా రబీ సాగు ఊపందుకోనుంది. జిల్లాలోని 12 డివిజన్ల పరిధిలోని 51 మండలాలు పరిధిలోని పంటలైన వరి, వేరుశనగ, పత్తి, మినుమలు, సోయా మీన్ తదితర పంటలను పెద్దఎత్తున సాగు ఊపందుకోనుంది. జిల్లాలోని రాజుపాలెం మండలంలోని 150 ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటల్లో నీళ్ల నిలవడం ఆందోళన కలిగించింది. జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరావు, కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంయుక్తంగా కమలాపురం, ఒంటిమిట్ట మండలాల్లో నీళ్ల నిలిచిన పంటలను పరిశీలించారు. వరి, మొక్కజొన్న, ఇతర ఉద్యాన పంటల పొలాల్లోని నీటి నిల్వల నుంచి రక్షణకు అవసరమైన సూచనలు, సలహాలను అందించడం గమనార్హం.

రబీ పంటలకు ఊతం

జిల్లాలో వేరుశనగ, పత్తి, మినుములు, ఉలవలు, అలసంద, అనుములు, మొక్కజొన్న తదితర సుమారు 20 రకాల పంటలు ఉపశనం కలగనుంది. జిల్లాలో 1.97 లక్షల ఎకరాల్లోని పంటలకు ఉపశమనం లభించనుంది. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్ ఒడిదుడుకుల నేపథ్యంలో రబీ సీజన్‌పైనే రైతాంగం ఆశలు పెట్టుకోవడం పరిపాటి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అక్టోబర్, నవంబర్ మాసాల్లో నమోదయ్యే వర్షపాతాన్ని బట్టి రబీ సీజన్ ఆధారపడి ఉంటుంది. అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో ఆశలను రేపుతోంది.

అట్లూరులో 17.2 మి.మీ

జిల్లాలోని అట్లూరు మండలంలో అత్యధికంగా 17.2 మి.మీటర్ల వర్ష పాతం నమోదైంది. ముద్దనూరు, తొండూరు, మైదుకూరుల్లో 0.0 మి.మీలతో వానజాడ కనిపించలేదు. అత్యల్పంగా కొండాపురంలో 0.2 మి.మీ, వల్లూరులో 1.4 మి.మీ, జమ్మలమడుగు, పెద్ద ముడియం 1.2 మి.మీ చొప్పున అత్యల్ప వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మంగళవారం సాయంత్రం కడపలో మోస్తరు వర్షపాతం నమోదు కావడం ఉపశమనం కలిగించింది. సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయానికి నమోదైన వర్షపాతాన్ని పరి శీలిస్తే అట్లూరుల అత్యధికంగా 17.2 మి.మీ, చక్రాయపేట 15.8 మి.మీ, ఒంటిమిట్ట 14.4 మి.మీ శాతం మేర వర్షపాతం నమోదు కావడం గమనార్హం.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కమలాపురం టౌన్/ఒంటిమిట్ట/కడప

ఫెంగల్ తుపాన్ నేపథ్యంలో వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంతాంగ్రం అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులపై సోమవారం ఉదయం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలాల వారీగా చెరువుల కట్టలు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు వంకలు కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి ప్రధాన కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పిహెచ్‌సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని చెప్పారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన.. ఫెంగాల్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరి శీలించారు. సోమవారం మధ్యాహ్నం కమలాపురం మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామంల స్థానిక ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డో కలిసి వరి, శనగ పంటలను పరిశీ లించారు. అనంతరం రైతులతో పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి వర్షాల కారణంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు గానీ, పశు సంపదకు కానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని కలెక్టర్ తెలిపారు. సాయంత్రం ఒంటిమిట్ట మండలం సాలాబాద్ గ్రామంలో పసుపు, సంపెంగ ఉద్యాన పంటలను సంబంధిత అధికారులతో కలిసి పరి శీలించారు. ఆయన వెంట కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుభాషిణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



కమలాపురంలో పంట వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్



పేదల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : వ్య.కా.స

ప్రజాశక్తి-కాశినాయన : పోరుమామిళ్ల మండలం రంగసముద్రం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.వీరయ్య, ఎస్.గురయ్యా డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం పోరుమామిళ్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇళ్ల లేని నిరుపేదలు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలు ఇల్లు లేక బాడుగ ఇళ్లల్లో ఉంటూ నెల నెలా వేల రూపాయలు కడుతున్నారని పేర్కొన్నారు. పేదలు కూలీ పనులకు వెళ్తే తప్ప పూట గడవదని, అలాంటిది బాడుగలు కట్టాలంటే ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. రంగసముద్రం రెవెన్యూ పొలంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నా పేదలకు మూడు సెంట్లు స్థలం ఇవ్వడానికి ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం అన్యాయం వాపోయారు. కాబట్టి నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల అర్జీలను పరిశీలించి విచారించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పోరుమామిళ్ల తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పేదల నుంచి ఇళ్ల స్థలాల అర్జీలు స్వీకరించారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- కడప అర్బన్

చలి తీవ్రత పెరగడంతో అనాధ వృద్ధులకు, నిరాశ్రయులకు కాంగ్రెస్ నాయకులు సయ్యద్ గౌస్ పీర్ మానవతా దృక్పథంతో నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ నగరంలో కురుస్తున్న వర్షానికి, చలికి ఇబ్బంది పడుతున్న అనాధ వృద్ధ నిరాశ్రయులకు, యాచకులకు మానవతా దృక్పథంతో ప్రతిఏటా శీతాకాల సమయంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడతామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కడప నగరంలో బస్టాండ్ కూడలి, పాత బస్టాండ్, ఆర్‌డిఒ కార్యాలయం, రిమ్స్ హాస్పిటల్, రవీంద్ర నగర్, పలు సర్కిల్లో నిరాశ్రయులకు దుప్పట్లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బ్యాడ్మింటన్‌లో రిమ్స్ వైద్యుల ఘనవిజయం

ప్రజాశక్తి - కడప సిటీ



వైద్యుడిని అభినందిస్తున్న ప్రిన్సిపల్

కెఎస్ఆర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కడప రిమ్స్‌కు చెందిన ఇద్దరు డాక్టర్ల ఘనవిజయం సాధించారు. ప్రొద్దుటూరు, కడప డాక్టర్ల మధ్య పోటాపోటీగా సాగిన టోర్న మెంట్‌లో ప్రథమ బహుమతిని డాక్టర్ వెంకట మనోజ్, డాక్టర్ శ్యాం సుందర్రావు విజయం సాధించారు. సాధించారు. వారిని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ సురేఖ, వైస్ ప్రిన్సిపల్ వై విజయభాస్కర రెడ్డి అభినందించారు. మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా అశ్రఫ్ సుభాని

ప్రజాశక్తి - కడప



విజేతగా నిలిచిన సుభాని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ విజేతగా కడపకు చెందిన అశ్రఫ్ సుభాని విజేతగా నిలిచాడు. ఈనెల 1న అనంతపురం సెయింట్ అగస్టిన్స్ ఇంగ్లీష్ మాధ్యమ హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్న మెంట్‌లో కడప నుండి పాల్గొన్న డి. అశ్రఫ్ సుభాని విజేతగా నిలిచారు. 7 రౌండ్లలో 6.5 పాయింట్లు సాధించాడు. ట్రోఫీ, రూ. 7 వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. అనంతపురం జిల్లా చెస్ అసోసియేషన్ నిర్వహించిన అండర్-10 బాలికల విభాగం చెస్ టోర్నమెంటులో కడప నుండి పాల్గొన్న దీపిక ఆరవ స్థానం సాధించింది. ఈ టోర్నమెంట్‌లో 272 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. రూ. 51 వేల ప్రైజ్ ఫండ్ తో నిర్వహించిన టోర్నమెంట్‌లో గట్టి పోటీ జరిగింది. విజేతగా నిలిచిన అశ్రఫ్ సుభానిని దీపిక ను జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అనిస్ దర్బారి అభినందించారు.

సిపిఎం నగర కార్యదర్శిగా రామమోహన్

ప్రజాశక్తి - కడప అర్బన్



మాట్లాడుతున్న రామమోహన్

కడపలో ఈనెల 1న నిర్వహించిన సిపిఎం నగర మహాసభలో 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం నగర కార్యదర్శిగా రామ మోహన్ ఎన్నికయ్యారు. సోమవారం కడప నగరంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఎం కడప నగర 6వ మహాసభలో నగర కమిటీ సభ్యులుగా దస్తగిరిరెడ్డి, కామనూరు శ్రీనివాసులు రెడ్డి, జమీల, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, కుమారస్వామిరెడ్డి, లక్ష్మీ, రాజు, సుబ్బయ్యతో పాటు మరో ఇద్దరిని కో-ఆప్షన్ సభ్యులుగా మహాసభ ఎన్నుకుందన్నారు. కడప నగరంలో అనేక దీర్ఘకాలికంగా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వాటి పరిష్కారం కోసం రాబోవు కాలంలో సిపిఎం పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. కడప నగర సమగ్ర అభివృద్ధి కోసం రానున్న 3 సంవత్సరాల కాలంలో నిర్దిష్ట ప్రణాళికతో కృషి చేయాల్సిన అవసరం ఉందని మహాసభ తీర్మానం చేసిందన్నారు. బుగ్గ వంక ఆధునీకరణ అప్రోచ్ రోడ్డు పనులు దశాబ్ద కాలంగా పూర్తి కాకుండా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజలపై విద్యుత్ భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కడప నగరంలోని అంబేద్కర్ సర్కిల్లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజానీకం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'సీమ'పై సిఎం దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కడప : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పక్షపాత ధోరణిని వీడి రాయలసీమ ప్రాంతం అభివృద్ధిపై దృష్టి సారించాలని పిసిసి మాజీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమరావతికి మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ రాయలసీమను పూర్తిగా విస్మరిస్తోంది అన్నారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం హైకోర్టును కర్నూలుకు తరలించాలని, కేవలం బెంచ్‌తో సరిపెట్టకూడదని అన్నారు. ఇది కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఆయన చెప్పారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలనిఅన్నారు. కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, కడప నగర కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పులివెందుల అసెంబ్లీ కోఆర్డినేటర్ ధ్రువ కుమార్ రెడ్డి, శీలం గంగయ్య, పులివెందుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు అనిల్ కుమార్ రెడ్డి, నాగరత్న గౌడ్ పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం శోచనీయం

వేంపల్లె : పులివెందుల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఈ ప్రాంత టిడిపి నేతలు కలిసి కక్ష సాధింపు చర్యలు చేపట్టడం శోచనీయమని శైలజానాథ్ పేర్కొన్నారు. వేంపల్లెలోని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయంగా చూస్తే 10 సంవత్సరాలు మనోభావాలు కూడ దెబ్బ తింటున్నట్లు చెప్పారు. మెడికల్ కళాశాలను చూస్తే టిడిపి నేతలకు బాధగా లేదా అని ఆయన ప్రశ్నించారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనివ్వండి

- అల్ షిఫా వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ



ప్రజాశక్తి- కడప అర్బన్ : విభిన్న ప్రతిభావంతులకు ప్రతిక్కరూ చేయూతనివ్వాలని అల్‌షిఫా వ్యవస్థాపకులు మహమ్మద్ రఫీ కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌లో సమస్యలు ఉన్నాయని చెప్పారు. వీరికి ఏ పని చేయడం రాదని తెలిపారు. ఇటువంటి వారికి పెన్షన్ నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి, తండ్రి ప్రభుత్వ ఉద్యోగి అయితే, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లో పనిచేస్తున్నా పెన్షన్ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిబంధనల నుంచి మిన హాయించి ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. విభిన్న ప్రతి భావంతులకు పెన్షన్, రేషన్ కార్డు ఇవ్వకపోవడం సరి కాదని పేర్కొన్నారు. ఆధార్ కార్డ్, వైకల్య సర్టిఫికెట్ ఉంటే పెన్షన్ మంజూరు చేయాలని తెలిపారు. ఆర్‌టిసి బస్సుల్లో విభిన్న ప్రతిభావంతులతోపాటు వారికి తోడుగా వచ్చే వారికి వందశాతం రాయితీ ఇవ్వాలని కోరారు. 2016 చట్టం ప్రకారం ఏపీలో మొదటిసారి కడప జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని గుర్తు చేశారు. 24 సంవత్సరాలుగా అల్ షిఫా కేంద్రాన్ని కొనసాగిస్తూ ఉన్నా మని తెలిపారు. 23 సంవత్సరాలలోపు వారికి ప్రస్తుతం సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో 23 సంవత్సరాలు పైబడిన వారికి కూడా ఒక ఆశ్రమం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు.

హామీలు గాలికి వదిలేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - కడప : చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకుండా గాలికి వదిలేశారని వైసిపి కడప జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో పాలన అనేదే లేకుండా పోయిందన్నారు. ప్రజలకు మేలు చేసింది ఏమీ లేదు, సోమవారం కడప జిల్లా వైఎస్‌ఆర్‌సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైందని, ఈ కాలంలోప్రజలకు చేసిన మేలు ఏదీ లేదని వాపోయారు. వైసిపి పాలనలో వర్షాలకు పంట నష్టం జరిగితే అదే సీజన్లో పరిహారం అందించాం అని తెలిపారు. ఇప్పుడు పంట నష్టపోయినా పట్టించుకునేవారు లేరన్నారు.

సెలవులు నిరాకరించడం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మెగా పేరెంట్స్ సమావేశాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులెవరు సెలవులు పెట్టుకోవడానికి వీలు లేదంటూ డిఇఒ ఆదేశాలు జారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ పరిపాలనాదికారి పి.మునీర్ ఖాన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈనెల 7న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించడాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశం పూర్తయ్యే వరకు ఉపాధ్యాయులు ఎవరు పాఠశాలలకు సెలవు పెట్టుకోవడానికి వీల్లేదంటూ ఎంఇఒలకు ఆదేశాలు ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. అనారోగ్యం కానీ, అత్యవసర కార్యక్రమాలు కానీ కుటుంబ సమస్యలతో కానీ ఇబ్బంది పడే ఉపాధ్యాయులు సాధారణ సెలవులు వాడుకోకూడదంటూ హుకుం జారీ చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేస్తారని చెప్పారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల పేరుతో సంక్రాంతి పండుగ సెలవుల్లో పూర్తిగా తరగతులు నిర్వహించే విధంగా కార్యాచరణ ప్రకటించడం తగదని తెలిపారు. పదవ తరగతి వందరోజుల కార్యాచరణ విషయంలో అధికారులు పునఃపరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనువైన విధంగా కార్యాచరణ రూపొందించాలని లేనిపక్షంలో కార్యాచరణను బహిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, యడాల సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నేటి వైవీయూ డిగ్రీ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి -కడప అర్బన్ : వైవీయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు మంగళవారం నిర్వహించాల్సిన సెమిస్టర్ పరీక్షలను రద్దు చేసినట్లు వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్వీ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. రద్దయిన పరీక్ష నిర్వహణ తేదీని తర్వాత తెలియజేస్తామని తెలిపారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మంగళవారం జరగాల్సిన పరీక్షలు మాత్రమే రద్దు చేశామని పేర్కొన్నారు.

విద్యుత్ ఒప్పందాలు రాష్ట్రానికి శాపం

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న అంజాద్‌బాషా

చంద్రబాబు నాయుడు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు ఈ రాష్ట్రానికి శాపంగా మారాయని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్‌బాష అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రచార సభల్లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ అని చెప్పారని, ఇప్పుడు అది బాబు ష్యూరిటీ - వీరబాదుడు గ్యారెంటీ అయిపో యిందని ఎద్దేవా చేశారు. తమ పార్టీ పోరాటాల నుంచి పుట్టిందని, భయపడే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ 6 నెలల కాలంలోనే 2 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.రూ. 15485 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపారని వాపోయారు. అబద్ధాలకు, నమ్మిన వారిని మోసం చేయడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని ఆరోపించారు. అవసరం లేకపోయినా అప్పట్లో విద్యుత్ కొనుగోలు చేశారని పేర్కొన్నారు. చంద్రబాబు 2014-19 మధ్య లక్ష కోట్లకు ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. ఇసుక, మద్యం, రిజిస్ట్రేషన్, విద్యుత్ ఛార్జీలతో బాదుడే బాదుడు అన్నారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు షఫీ, బీహెచ్ ఇలియాస్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి కాంస్య పతకం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయానికి చెందిన వెయిట్ లిఫ్టింగ్ 81 కేజీల పురుషుల విభాగంలో దేవరకొండ ప్రేమ్ సాగర్ కాంస్య పతకం సాధించారు. ఈయన స్నాచ్ 189 కేజీలు , క్లీన్ అండ్ జర్క్ 163 కేజీల బరువు ఎత్తారు. మొత్తం 297 కేజీలను ఎత్తి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన్ను విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, వ్యాయామ విద్య, క్రీడల శాఖ విభాగ రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) జిల్లా కమిటీ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో డిఆంఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో నంబర్ 36 అమలు చేయాలని తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగ్ ఉన్న జీవోలు విడుదల చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం స్పందించి జీవోలు విడుదల చెయ్యాలని చెప్పారు. లేని పక్షంలో దశల వారి ఆందోళనకు వెళ్తామని పేర్కొన్నారు. అవసరమైతే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. విజయభాస్కర్, కోశాధికారి గోపి, శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.



ప్రమాదంలో దుర్మరణం చెందిన రోశయ్య, సుబ్బయ్య ఆచారి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ఆటోను ఢీకొన్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు


ఇద్దరి పరిస్థితి విషమం, నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-కాశినాయన

పోరుమామిళ్ల కాలువకట్ట సమీపంలో ఆటోను, ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టడంతో ఇద్దరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తలరించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొంటున్నారు. వివరాలు..ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలం పాపాయిపేట నుంచి కడపకు ఆటో బయలుదేరింది. అక్కడక్కడ ప్రయాణికులను ఎక్కించుకుంచుకున్నారు. పోరుమామిళ్ల కొమరోలు ప్రధాన రహదరి కాలువ కట్ట వద్దకు రాగానే ప్రయాణికులతో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఆటోలో డ్రైవర్‌తో సహా ఏడుగురు ప్రయాణిస్తున్నారు. ప్రమాదంలో పోరుమామిళ్ల మండలం రామేశ్వరానికి చెందిన సుబ్బయ్య ఆచారి (65), అక్కిల్‌రెడ్డిపల్లికు చెందిన రోశయ్య (64) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. డ్రైవర్‌కు, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారందరిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల్ని విచారించి బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులే న్యాయం చేయాలి

ప్రజాశక్తి కడప అర్బన్



బాధితుడు రేణుకారెడ్డి

తనకు ఉన్న 40 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అధికారులే న్యాయం చేయాలని కొండాపురం మండలంలోని ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్రాంత తపాల ఉద్యోగి రాచమల్లు రేణుకారెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ 40 సెంట్ల స్థలం తమ పూర్వీకుల ఆస్తిగా అనుభవంలో ఉందని తెలిపారు. స్థలాన్ని అప్పనంగా లాక్కునేందుకు, ఎటువంటి ఆధారాలు లేని అదే గ్రామానికి చెందిన మలికిరెడ్డి రవినాథ్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, వెంకట్ నారా యణరెడ్డి, వెంకటరామిరెడ్డి సర్వప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. ఈ స్థలంపై తమ దగ్గర ఉన్న ఆధారాలతో రెండేళ్ల కిందట జమ్మలమడుగు కోర్టును ఆశ్రయి ంచామని పేర్కొన్నారు. అయినప్పటికీ ఆ స్థలాన్ని అక్రమంగా కాజేసేందుకు అనేక మార్లు ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. కేసు ఉపసంహరించుకోకపోతే తనను, తన కుటుంబాన్ని వారంలోపు అంతం చేస్తామని బెదిరిస్తున్నారని వాపో యారు. తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, జిల్లా ఉన్నతా ధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో విచారించి వారిని కఠినంగా శిక్షంచాలని కోరారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-కాశినాయన : ప్రస్తుతం జాతీయ కీటక జనీత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పి.మనోరమ పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని సావిశెట్టి పల్లె గ్రామాన్ని సందర్శించారు. అక్కడ జ్వరాలతో బాధపడుతున్న నలుగురిని పరీక్షించి వారికి టైఫాయిడ్‌గా గుర్తించారు. అనుమానిత కేసులకు డెంగీ, ఆర్‌డిటి, మలేరియా పరీక్షలు చేశారు. అన్ని గృహాల్లో లార్వా, జ్వర సర్వేలను ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్, సూపర్‌వైజర్లతో చేయించారు. కొందరి రక్తం సేకరించి పరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు పంపారు. మండల వైద్యాధికారి పుష్ప ఆధ్వర్యంలో 39 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల హెచ్‌ఇఒ శివశంకర్‌రెడ్డి, సిహెచ్‌ఒ నిర్మల, పిహెచ్ఎన్ శారద, హెల్త్ సూపర్‌వైజర్ డి.బాలయ్య,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యువత మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం దుష్పరిణామాలపై స్థానిక కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. డ్రగ్ మాఫియాకు దూరంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ జయరాజు మాట్లాడుతూ మెంటలీ ఇన్-బ్యాలెన్స్ కండిషన్స్ మర్జ్వాన, కొకైన్, హెరైనే, లాంటి డ్రగ్స్ వాటి వినియోగం వల్ల నష్టాలు, మయన్మార్, థాయిలాండ్ వంటి దేశాల పరిస్థితులు, వాటి చట్టాలు, డ్రగ్స్ నిరోధక వ్యవస్థ, ఎలాంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.రవి కుమార్, కృష్ణ కుమార్, కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టీ.ఎన్.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న నారాయణ యాదవ్, దాతలు

అన్నదానం చాలా గొప్పది

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె దేవాలయం వీరభద్రస్వామి సన్నిధిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి అన్నదాన సత్రంలో సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి నెర్రవాడ గ్రామానికి చెందిన టిడిపి బిసి జిల్లా నాయకుడు మేకల బాబు దంపతులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ మారుతి ప్రసాద్, టిడిపి నాయకులు ఎంఎల్‌సి ఇన్చార్జ్ ఎంపి పేరుగు నారాయణ యాదవ్, గుర్రి నారాయణ యాదవ్, కొండపల్లె ఉమాకాంత్, ఆలయ మాజీ చైర్మన్ వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వ రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు : శ్రీ గురు (ట్రస్ట్) పోర్టు యజమాని గురప్ప, ఉమాదేవి ఆధ్వర్యంలో సోమవారం శ్రీగురు ఆంజనేయ రైస్ మిల్లో 400 మంది అయ్యప్ప భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నారాయణ, ఓబులేసు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాగుడుకు బానిసైన
తనయుడిని హతమార్చిన తండ్రి

ప్రజాశక్తి - దువ్వూరు



హుస్సేన్‌బాషా(ఫైల్‌ఫొటో)

తాగుడుకు బానిసై తండ్రి చేతిలో తనయుడు హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని కానగూడురులో జరిగింది. గ్రామానికి చెందిన హుస్సేన్ బాషా(23) తన తండ్రి మహబూబ్ షరీఫ్ చేతిలో హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. మద్యానికి బానిసై హుస్సేన్‌బాషా తన కుటుంబ సభ్యులను డబ్బు కోసం వేధించేవాడు. ముఖ్యంగా తన తల్లిదండ్రులు, భార్యను ప్రతిరోజూ డబ్బు కోసం వేధించేవాడు. 15 రోజులుగా డబ్బు ఇవ్వమని ప్రతిరోజూ తన తల్లిదండ్రులను ఒత్తిడి చేసేవాడని మైదుకూరు రూరల్ సిఐ శివ శంకర్ యాదవ్, దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. కొద్దిరోజుల క్రితం డబ్బు ఇవ్వలేదని తన తండ్రిని కర్రతో కొట్టి చంపుతానని బెదిరించాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10గంటల సమయంలో హుస్సేన్‌బాషా మద్యం తాగి ఇంటికి వచ్చి తన తండ్రిని డబ్బు కోసం వేధించాడు. డబ్బులు లేవని చెప్ప డంతో కోపంతో బెదిరించాడు. భయానికి గురైన మహబూబ్ షరీఫ్ రోకలిబడేతో హుస్సేన్‌బాషా తలపై బలంగా కొట్టాడు. తీవ్ర గాయాలతో ఉన్న హుస్సేన్ బాషాను కుటుంబ సభ్యులు చాగలమర్రి కేరళ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. హుస్సేన్ బాషా భార్య మహబూబా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

స్థానిక బిజిఆర్ బార్ అండ్ రెస్టారెంట్‌లోని రూం నెంబర్ 206లో ఆదివారం రాత్రి కొప్పుల రాఘవేంద్ర (30) అనే యువకుడు దారుణ హత్య



రాఘవేంద్ర (ఫైల్ ఫొటో)

గురయ్యాడు. పోలీసులు రంగప్రవేశం చేసి వివరాలు సేక రిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం యనమల లోకేష్‌రెడ్డి పేరుతో లాడ్జిలో రూం బుక్ చేశారు. మరి కొంతమంది యువకులు కలిసి బార్‌లో ఒక రూం తీసు కున్నారు. అందరూ కలిసి బాగా మద్యం సేవించి ఎంజాయ్ చేసినట్లు సిబ్బంది తెలిపారు. అయితే అప్పుడప్పుడూ వారు కేకలు వేస్తూ కొట్టుకోవడం తెలియ వచ్చింది. అంతలో కొప్పుల రాఘవేంద్ర మరికొందరు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆ తర్వాత రాత్రి 9:30 గంటల సమయంలో మళ్లీ కొప్పుల రాఘవేంద్ర లాడ్జికి వచ్చాడు. అప్పటికి కూడా బాగా మద్యం సేవించి అందరూ ఒకరికొకరు గొడవ పడుతూ వచ్చారు. వీరంతా మామూలుగా సరదాగా గొడవ పడుతున్నారని ఎవరికీ వారిపై అనుమానం రాలేదన్నారు. తెల్లవారి చూసేసరికి రాఘవేంద్ర ముఖంపై మద్యం సీసా గాట్లు కనిపించాయి. అతను అప్పటికే మృతి చెందాడని సిబ్బంది పేర్కొంటున్నారు. ఆ మేరకు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. డాగ్స్ స్క్వాడ్ క్లూస్ టీం రానున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. ఏ విధంగా ఈ హత్య జరిగిందనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. లాడ్జిలోని సీసీ కెమెరాలు ఆధారంగా కొంతమంది అనుమానితుల్ని పోలీసులు విచారణ చేస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

18 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

జీవాలకు సంబంధించిన విషయమై ఆదివారం రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవకు సంబంధించి 18 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పుచెర్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య జీవాలను కొన్ని రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. వాటిని అదే గ్రామానికి చెందిన ఓబులేసు ఎత్తుకెళ్లాడని ఈశ్వరయ్య పుకార్లు రేపాడు. విషయం ఓబులేసు కుటుంబ సభ్యులకు తెలియడంతో ఓబులేసు, గంగరాజు కుటుంబ సభ్యులు కలిసి ఈశ్వరయ్య ఇంటి వద్దకు వెళ్లి అడగడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుని, గొడవ పడ్డారు. అనంతరం ఓబులేసు, గంగరాజు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బైకులో వస్తుండగా నాలుగు రోడ్ల వద్ద వెనకల ఈశ్వరయ్య తన కుమారుడు శివశంకర్ మరి కొందరు కారులో వచ్చి బైకు అడ్డగించి.. ఓబులేసు, గంగరాజుపై కారం పొడి చల్లి కత్తులతో దాడి చేసి గాయపరిచారు. ఈశ్వరయ్య భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఓబులేసు, గంగరాజు, ఆంజనేయులు, ముగ్గురు మహిళలు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. భాదితుడు గంగరాజు ఫిర్యాదు మేరకు ఈశ్వరయ్య, శివ శంకర్, మణికంఠ రెడ్డి, మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాణ్యతా లోపం.. అధికారుల పర్యవేక్షణ కొరవడి
దెబ్బతిన్న బస్సు షెల్టర్లు..రూ.లక్షలు బూడిదపాలు



మురారి చింతలలో పైకప్పులేక, పిచ్చిమొక్కలతో ఉన్న బస్సు షెల్టర్

ప్రజాశక్తి - లింగాల

పదికాలలపాటు పదిలంగా ఉండాల్సిన నిర్మాణాలు పట్టుమని పది రోజులకే క్షేత్రస్థాయిలో దెబ్బతింటున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేయడంతో రూ.లక్షలాది ప్రజాధనం దుర్వినియోగమవుతోంది. నిర్మాణానంతరం వాటి నిర్వహణ పట్టించుకొనకపోవడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. క్రమేణా ఆ నిర్మాణాలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి.. లింగాల మండలం పరిధిలో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్లు ఇందుకు నిదర్శనం. ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం బస్సు షెల్టర్లు నిర్మించారు. అప్పట్లో ప్రభుత్వం 15బస్సు షెల్టర్లను ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో నాలుగు బస్సు షెల్టర్ల నిర్మాణాలను పూర్తి చేశారు. ఒక్కో దానికి రూ.4.50లక్షలు ఖర్చు చేశారు. వీటిలో మురారి చింతల, కర్ణపాపయ్యపల్లె, అంబకపల్లె, ఇప్పట్ల బాలయోగి బాలికల కళాశాల పరిసరాల్లో బస్సు షెల్టర్లున్నాయి. వీటిని 2020లో నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇందుకు కారణం నాసిరకంగా పనులు చేయడమేననే ఆరోపణలున్నాయి. మురారచింతల గ్రామంలో ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ పైకప్పు పూర్తిగా దెబ్బతింది. ఈ క్రమంలో ఆ బస్సు షెల్టర్ చుట్టూ కంపచెట్లు పెరిగాయి. దాన్ని పశువుల పాకగా మార్చేశారు. ఈ నేపథ్యంలో ప్రయాణికులు బస్సు షెల్టర్ వద్ద నిలబడలేని పరిస్థితి. కేవలం కాంట్రాక్టర్ల లబ్ధి కోసం వాటి నిర్మాణాలు చేపట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పట్ల బాలయోగి బాలికల గురుకుల పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ కూడా అధ్వానంగా ఉంది. ఈ బస్సు షెల్టరకు కూడా పైకప్పులేదు. వీటి నిర్మాణాలు చేపట్టిన ఆరు నెలలకే పైకప్పు పూర్తిగా లేదు. దూరప్రాంతాలు వెళ్లేందుకు బస్సు కోసం ఇక్కడికి వచ్చే విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. ఉపయోగం లేని ప్రదేశాల్లో బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. కీలకమైన బస్టాప్, బస్టాండ్ ప్రదేశాల్లో బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయకపోవడంతో నేడు ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడంతో కాంట్రాక్టర్లు కిందిస్థాయి అధికారులు కుమ్మక్కై నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలున్నాయి. బస్సు షెల్టర్ల విషయమై పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దినేష్‌రెడ్డిని వివరణ కోరగా.. బస్సు షెల్టర్ ప్రత్యేక నిర్వహణకు లేదు. పైకప్పులు ఏర్పాటు చేశాం. గాలికి ఎగిరిపోయాయని తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.



ఇప్పట్ల బాలయోగి బాలికల పాఠశాల ముందు దెబ్బతిన్న బస్సు షెల్టర్ పైకప్పు

కాలేయ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న అమ్మ సేవా సమితి సభ్యులు రమేష్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సింహాద్రిపురం మండలం పైడిపాలెం గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ కూలి పనులు చేసుకునే నిరుపేద. రఫీ దంపతులకు 10 నెలల కిందట మహమ్మద్ రియాజ్ అనే బాలుడు పుట్టుకతోనే కాలేయ వ్యాధితో జన్మించాడు. చిన్న వయసులోనే వ్యాధిని గుర్తించిన వైద్యులు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించి, అధునాతన వైద్యం అందిస్తే బాలుడు బతికే అవకాశం ఉందని చెప్పారు. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలైన రఫీ కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా గుర్తించిన పట్టణానికి చెందిన ప్రముఖ సంఘసేవకుడు అమ్మసేవా సమితి అధ్యక్షుడు పూల రమేష్ బాబు స్పందించి, తన మిత్రబృందం ద్వారా ఎవరికి తోచినంత వారు విరాళాలు సేకరించి, అవసరమైన వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30వేలు సమీకరించారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులోని హెచ్‌పి గ్యాస్ సమీపంలో ఉన్న ఆర్‌వి న్యూట్రిషన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో దాతలు మహమ్మద్ రఫీ కుటుంబ సభ్యులకు సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. చిన్నారి అనారోగ్య పరిస్థితిని సమాజం దృష్టికి తీసుకువచ్చిన సామాజిక బాధ్యత గల మీడియా మిత్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నట్లు వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథ్‌రెడ్డి ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ సేవాసమితి అధ్యక్ష కార్యదర్శులు పూల రమేష్ బాబు, సాగర్ బాబు, న్యూట్రిషన్ హెల్త్ సెంటర్ నిర్వాహకులు పెద్ద వీరయ్య, దాతలు అల్లిపీరా, మల్లికార్జునరెడ్డి, నారాయణస్వామి, బాబా, జాకీర్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభచూపిన కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దముడియం

మండల పరిధిలోని పెద్దపసుపుల కెజిబివి పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థినులు కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17లో సాఫ్ట్‌బాల్ పోటీలో అదరగొట్టారు. గత నెల రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు కాకినాడలో రాష్ట్రస్థాయి అండర్-17ను నిర్వహించడంతో రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులతో జరిపిన ఆటలు పోటాపోటీగా సాగాయి. ఈ సమ్మిట్‌లో పెద్దపసుపుల కెజిబివి విద్యార్థినులు వెంకట హారిక, నాగ దివ్యశ్రీ, మౌనిక, దీక్షిత సాఫ్ట్‌బాల్ పోటీలో గెలుపొంది షీల్డ్ సంపాదించి తృతీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులు సాధించిన విజయం తోటి విద్యార్థినుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచిందని, ఇందుకు తమకు చాలా గర్వంగా ఉందని ప్రధానో పాధ్యాయులు మౌనిక పేర్కొన్నారు. షీల్డ్ సంపాదించిన విద్యార్థినులను ప్రశంసిస్తూ వారిని అభినందించారు.



గెలుచుకున్న షీల్డ్‌లను చూపుతున్న విద్యార్థినులు

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- లింగాల



అభినందిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో బాలయోగి బాలికల పాఠశాల విద్యా ర్థులు ప్రతిభ కనబరిచారు పశ్చిమ గోదావరి జిల్లాలోని పెద్దవేగి అంబేద్కర్ పాఠశాలలో గత నెల 28,29,30 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో లింగాల మండలం ఇప్పట్ల బాలయోగి బాలికల పాఠశాల క్రీడా కారులు ప్రతిభ చూపారు. ఈ నేపథ్యంలో పాఠశాలకు చెందిన ఇంటర్మీ డియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి జ్యోతి డిక్లరేషన్ త్రోలో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలిచింది. 7వ తరగతి చదువుతున్న భవ్య 200 మీటర్ల పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సెక్రటరీ ప్రసన్న వేంకటేసు, జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణ, అకాడమిక్ మానటరీ అఫిసర్ సంజీవరావు చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపల్ సత్యవతమ్మ, వ్యాయామం ఉపాధ్యాయురాలు సునిత, నిఖిల, ఉపాధ్యాయులు అభినందించారు.

'గంగ' కాలువ స్థలం విక్రయించారని ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మండల పరిధిలోని జివి సత్రం తెలుగుగంగ ప్రాజెక్టు భూమిని విక్రయించారని ఆ ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. మైదుకూరు అర్బన్ పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. తెలుగంగ ప్రాజెక్టులో భాగంగా దువ్వూరు మండలం ఎస్ఆర్-1(చల్లబసాయపల్లె సమీపంలో) ఉప జలాశయం నుంచి జవి సత్రం మీదుగా ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లె పెన్నానది వరకు స్థలాన్ని సేకరించి, 48 కిలోమీటర్ల కాలువను గతంలో ఏర్పాటు చేశారు. ఈ కాలువలో భాగంగా జివి సత్రం సమీపంలో 22 కిలోమీటర్ల వద్ద సర్వే నెంబర్ 290 బి, 292లో వరదాయపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు ఎంఎన్ఆర్ కుటుంబ సభ్యులకు చెందిన 2.16 ఎకరాలు ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది. ఇందులో కాలువ కోసం 0.76 ఎకరాలు ఉపయోగించారు. మిగిలిన 1.41 మిగులు భూమిని ఎంఎన్ఆర్ కుటుంబ సభ్యులు 22 మందికి విక్రయించారని తెలుగంగ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సోమవారం ఎం.పెద్ద నరసింహారెడ్డి, ఎం.చిన్న నర్సింహారెడ్డి, ఎంఎన్‌రెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. వీరి అరెస్టు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపులో భాగమని వైసిపి నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. 1997లో తెలుగుగంగ కాలువకు ఎంఎన్ఆర్ కుటుంబ సభ్యులు తక్కువ ధరకు పొలాన్ని ఇచ్చారన్నారు.



నిందితుల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్న వైద్యులు



మాట్లాడుతున్న సుబహాన్

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దేశంలోని పౌరులందరూ భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని వెల్ఫేర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ సుబహాన్ పేర్కొన్నారు. స్థానిక కెహెచ్‌ఎం వీధిలోని జమాఅతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఆదివారం పొద్దుపోయాక భారత రాజ్యాంగ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా సుబహాన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పీఠిక అర్థాన్ని వివరించారు. భారతదేశ ప్రజలమైన మనం భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగ నిర్మించుకున్నామన్నారు. పౌరులందరికీ సాంఘిక ఆర్థిక న్యాయాన్ని ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని సాదించుకున్నామన్నారు. రాజ్యాంగ పరిషత్‌లో 1949 నవంబర్ 26న ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకున్న రాజ్యాంగాన్ని తమకు తాముగా సమర్పించుకుంటున్నామని తెలిపారు. మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం మాట్లాడుతూ భారతదేశం లౌకిక దేశమన్నారు. ఒక మత ఆధారంగా నడవదన్నారు. రాజ్యాంగం ఆధారంగా నడుస్తుందన్నారు. మతం అనేది వ్యక్తిత్వమన్నారు. దేశంలో జీవించే ప్రతి భారతీయుడికి సమాన హక్కులు కల్పించే గొప్ప దేశం మన భారతదేశం అన్నారు. కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అద్యక్షులు జాకీర్ హుశేన్, పట్టణ అధ్యక్షులు హుశేన్‌బాషా, ఉపాధ్యక్షుడు నజీర్, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు సాగు భూమి ఇచ్చే వరకూ పోరాటం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పేదలకు సాగుభూమి ఇచ్చే వరకు పోరాటం చేస్తామని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య , దళితకుల పోరాట సమితి, దళిత డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల్లోని సాగుభూమికి అర్హులైన సుమారు దాదాపు 500 మంది ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ సాగు భూమికి అర్హులైన పేదల జాబితా సిద్ధం చేయకపోతే కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి బుక్కే శంకర్ నాయక్, జిల్లా అధ్యక్షుడు కే బ్రహ్మయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి కె మునయ్య, దళిత డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేసీ బాదుల్లా, పి చంద్రశేఖర్, సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు, సహాయ కార్యదర్శి కొత్తకాల్వ బ్రహ్మం, భాష, ఇమ్మానుయేలు, విద్యార్థి సంఘ నాయకులు చంద్ర పాల్గొన్నారు.

వైఎస్ బతికి ఉంటే షర్మిలను విమర్శించేవారా?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి పిసిసి అధ్యక్షులు షర్మిలను విమర్శించే సాహసం చేసేవారా అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో-ఆరినేటర్, కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా సూటిగా ప్రశ్నించారు. తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిలను విమర్శించేందుకు మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం ఉందా లేకుంటే మీకైమీరు ఇష్టానుసారం మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. అన్నా చెల్లెలు మధ్య ఉన్న వ్యక్తిగత వ్యవహారాల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. వ్యక్తిగతంగా విమర్శిస్తే తాము రాజకీయంగా ఎదుర్కొంటామని, రాజకీయంగా 10 ప్రశ్నలు సంధిస్తామని సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - లింగాల

లింగాల జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు భారతి పాలిమర్స్ ప్రయివేట్ లిమిటెడ్ జిఎం వల్లపునేని శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కంటి పరీక్షలు, అవసరమైన వారికి కంటి అద్దాలు, అపరేషన్లు నగదు రహితంగా చేయనుననట్లు తెలిపారు. శుక్లాలకు అధునిక అపరేషన్, మెల్లకన్ను, రెటీనా, కార్నియా అపరేషన్లు, చిన్న పిల్లల కంటి చికిత్సలు సంబంధించిన వాటిపై ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రామ సచివాలయం.. అంతా అపరిశుభ్రం..!

ప్రజాశక్తి - ఖాజీపేట



పిచ్చిమొక్కలతో చెన్నముక్కపల్లె సచివాలయం

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ అధికారులు పదేపదే గొప్పగా చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ ఆశయం నీరు గారు తోంది. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజ లకు ఆదర్శంగా ఉండాలి. అపరిశుభ్రత మధ్య కొనసాగుతున్నాయి. పచ్చదనంతో కళకళలాడాల్సిన కార్యాలయాలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తూ, విష సర్పాలకు ఆవాసాలుగా మారు తున్నాయి. కార్యాలయాల్లో శుభ్రతపై దృష్టి సారించాల్సిన అధికారులు ఏమాత్రం పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని చెన్నముక్కపల్లి గ్రామ సచివాలయం అపరిశుభ్రతకు నిలయంగా మారింది. కార్యాలయం ఆవరణంతా పిచ్చిమొక్కలతో నిండి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్య తీసుకొస్తున్నా, ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సచివాలయాలను పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. సచివాలయం చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్లపొదలు పిచ్చి మొక్కల వల్ల విష ప్రాణులు అధికంగా సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సచివాలయం చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాల శుభ్రతపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప
OS No. 686/2024

Canara Bank, Represented by its Manager, Main Branch-II, Kadapa City & District. ...వాది

Vs

Peddamalla Siva Raja Reddy, S/o. Chinna Malla Reddy, Hindu, age 45 Years, Business, resident of D.No. 1/106, Alamkhanpalli, Kadapa City, YSR District - 516003.

...1వ ప్రతివాది

ప్రతివాదులకు సమన్లు

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై దావా మీ హాజరు కొరకు 23.12.2024వ తేదీన ఉదయం గం. 10.30 ని.లకి పై తెలిపిన కోర్ట్ నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//
కె. వెంకట సుబ్బయ్య, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది,
సెల్: 9704890225.

IN THE COURT OF THE HON'BLE III ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA.
O.S. No. 593/2022

Andhra Pragathi Grameena Bank, Represented by its Chief Manager, Jayanagar Colony Branch, Kadapa. ...Plaintiff

Vs

1) Polireddy Samba Siva Reddy, S/o. P. Subba Reddy, Hindu, aged about 56 years, Business, residing at D.No. 14/615, Venugopal Swamy Street, Nakash, Kadapa city. (Now Died).
2) Shaik Ansar, S/o. Shaik Abdul Jabbar, Muslim, aged about 43 years, Vegetable Business, residing at D.No. 16/449-12, Ghouse Nagar, Kadapa city.

...Defendants

NOTICE TO DEFENDANT No.2

Please take notice that the Hon'ble Court has ordered for notice to the defendant No.2 to appear on 05-12-2024 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//
B. SYAM SUNDER
Advocate for plaintiff,
KADAPA

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE : KADAPA
O.S.No. /2024

Nadendla Rasool Bee @ Nadendla Sujatha, W/o Late Nadendla Rama Veeraiah, Dudekula by Caste, aged about 60 years, Home maker, R/at 1-125, Mugguralle Krishnappa Compound, Near Kadapa Railway Station, Yerramukkapalli Post, Kadapa City and Kadapa Dist.

...Plaintiff

Vs

NIL. ...Defendant

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడము ఏమనగా నా కక్షిదారులైన శ్రీమతి నాదేండ్ల రసూల్ బీ @ నాదేండ్ల సుజాత పైన తెలిపిన కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తన పేరును నాదేండ్ల సుజాతగా పేరు మార్చుకుంటున్నారు. ఇందుకు గాను ఎవరికైనా అభ్యంతరము వున్న యెడల రాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కడప కోర్టులో వారం (7)రోజులలోగా కోర్టునకు వచ్చి వారి అభ్యంతరమును తెలుపుకొనవచ్చును. లేని యెడల కోర్టు వారి ఉత్తర్వు మేరకు ఉత్తర్వులు జారీ చేయబడును.

వడ్డి సురేంద్రరావు, B.A.,B.L.,
పిటిషనర్/ప్లెయింటిఫ్ తరపున న్యాయవాది,
కడప నగరం, కడప జిల్లా.
సెల్: 9393622664.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప
O.S.No. 682/2024

Canara Bank, Represented by its Manager, Main Branch-II, Kadapa City & District. ...వాది

Vs

1. G. Lakshmi Devi, W/o. G. Gopala Krishnudu, age 34 Years, Kirana Shop business (Shop at D.No. 41/898-2, Sankarapuram, Kadapa), resident of D.No. 6/1149, Sankarapuram, kadapa City, Kadapa District.
2. K. Bhaskar, S/o. K. Chennaiah, Hindu, age 40 Years, Business, resident of D.No. 39/377, Vivekananda Nagar, Kadapa City, Kadapa District.

...ప్రతివాది నెంబరు 1&2

ప్రతివాదులకు సమన్లు

పై ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై దావా మీ హాజరు కొరకు 19.12.2024వ తేదీన ఉదయం గం. 10.30 ని. లకి పై తెలిపిన కోర్ట్ నందు వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//
కె. వెంకట సుబ్బయ్య, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది,
సెల్: 9704890225.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE : KAMALAPURAM
O.S.No. 72/2024

సిరియపురెడ్డి వీరారెడ్డి, S/o సిరియపురెడ్డి పోలిరెడ్డి, వయస్సు 64సం॥లు, హిందు, బిజినెస్, డోర్‌నెం.1-60, సోమాపురం ఆనందశ్రమము (పోస్టు), చాపాడు మండలం, కడప జిల్లా. ...వాది

Vs

సిరియపురెడ్డి పాపులమ్మ, W/o సిరియపురెడ్డి పోలిరెడ్డి, వయస్సు 80 సం॥లు, డోర్‌నెం.7/1-731/2, మహమ్మద్ కాలనీ, నేతాజీ స్కూల్ దగ్గర, బద్వేల్ మండలం, కడప జిల్లా.

...ప్రతివాది

సమను

పై దావాలోని వాది ప్రతివాది అయిన మీరు వాది పైన వ్రాసిచ్చిన విక్రయ అగ్రిమెంటు 22/01/2020 అమలుకు గాను పై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావా 10.12.2024 తేదీన వాయిదా వున్నది. సదరు వాయిదా తేది 10.12.2024 తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరుగాని మీ తరపున వకీలు గానీ హాజరై ఆక్షేపణ తెలుపుకోనవలయును.లేనంతట మిమ్మల్ని పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//
UDAYA KUMAR
V. RAMA MOHAN
K. RAMA MOHAN
B.N. AKBAR ALIKHAN
Advocate, KADAPA.

IN THE COURT OF THE HON'BLE III ADDL., JUNIOR CIVIL JUDGE, KADAPA.
I.A. No. 486/2024
O.S. No. 593/2022

Andhra Pragathi Grameena Bank, Represented by its Chief Manager, Jayanagar Colony Branch, Kadapa. ...Petitioner

Vs

1) Polireddy Samba Siva Reddy, S/o. P.Subba Reddy, Hindu, aged about 56 years, Business, residing at D.No.14/615, Venugopal Swamy Street, Nakash, Kadapa city, having died his L.Rs. D-3 to D-5.
2) Shaik Ansar, S/o. Shaik Abdul Jabbar, Muslim, aged about 43 years, Vegetable Business, residing at D.No. 16/449-12, Ghouse Nagar, Kadapa city.
3) Polireddy Sumithra Devi, W/o. Late P. Samba Siva Reddy, Hindu, aged about 47 years.
4) Polireddy Naga Manikanta Reddy, S/o. Late P. Samba Siva Reddy, Hindu, aged about 24 years.
5) Polireddy Sree Charan Reddy, S/o. Late P. Samba Siva Reddy, Hindu, aged about 23 years.
D-3 to D-5 are residents of D.No. 14/615, Venugopal Swamy Street, Nakash, Kadapa city.

...Respondents

NOTICE TO RESPONDENTS No.3 TO 5

Please take notice that the Hon'ble Court has ordered for notice to the respondents No.3 to 5 to appear on 05-12-2024 at 10:30 A.M. in the above Court, failure to appear by you the matter will be decided exparte.

//By Order of the Hon'ble Court//
B. SYAM SUNDER
Advocate for plaintiff,
KADAPA